క్లుప్తంగా

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లకుంట: ఓయూ రోడ్డులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) లిటరసీ హౌజ్‌లో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, టాలీ, ఈఆర్‌పీ-9, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ లిటరసీ హౌజ్ కార్యదర్శి నాగలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫోటోషాప్, పేజ్‌మేకర్, డీటీపీ (డెస్క్ టాప్ పబ్లిషింగ్), టైలరింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్స్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెహిందీ డిజైనింగ్ తదితర స్వల్పకాల వ్యవధి కోర్సుల్లో కూడా శిక్షణ ఉంటుందని వివరించారు. ఈనెల 31న దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెల్ నంబర్లు 84980 80599/99512 10441/040-27098406 సంప్రదించాలని కోరారు.

23న నటుడు చంద్రమోహన్‌కు పురస్కారం

చిక్కడపల్లి: విభిన్న పాత్రలు వేయికి పైగా సినిమాల్లో నటించిన ప్రముఖ నటుడు చంద్రమోహన్‌కు ప్రఖ్యాత నటుడు ఎన్.టీ.ఆర్, వంశీ పురస్కారం ఈ నెల 23న బహుకరిస్తున్నట్లు వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీ రామరాజు విలేకరుల ఆదివారం తెలిపారు. చంద్రమోహన్ ఆరోగ్యకారణాల రీత్యా ఆయన స్వగృహంలోనే పురస్కారాన్ని బహుకరిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా సీబీఐ విశ్రాంత అధికారి లక్ష్మీ నారాయణ పాల్గొనగా.. సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, రచయిత్రి జలంధర, న్యూస్ ప్రెజెంటర్ దేశాయ్ శ్రీదేవి, డాక్టర్ తెన్నేటి సుధ, శైలజలు హాజరుకానున్నారు.

బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సబ్బని లత



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సబ్బని లత నియమితులయ్యారు. ఆదివారం నియామక పత్రాన్ని ఆమె బీఎల్‌పీ చైర్మన్ నల్లా సూర్య ప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా వామపక్ష ఉద్యమంలో ముఖ్యంగా బహుజన శ్రామికవర్గ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేశారన్నారు. అనేక ఉద్యమాలు చేసి ప్రభుత్వ నిర్బంధం వల్ల నెలల తరబడి జైలు జీవితాన్ని కూడ అనుభవించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర నాయకురాలు సీహెచ్ గీతాంజలి సబ్బని లతకు పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేషన్ డీలర్ల సమ్మెకు మద్దతు

ముషీరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూన్5 నుంచి సమ్మె చేస్తున్న రేషన్ డీలర్లకు మద్దతు ఇస్తున్నట్లు పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కాశీనాథ్, కే.ఎస్ ప్రదీప్, బి.స్వరూప, సీ.హెచ్ శిరోమణిలు ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. 50 కేజీల రేషన్ బియ్యం బస్తా తరుగుతో వస్తున్న అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో సేవలు అందించి 99 మంది మరణించిన వారి కుటుంబాలను ఆదుకోలేదన్నారు. 17 వేలకుపైగా ఉన్న రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులను అందించాలని వారు డిమాండ్ చేశారు.

త్యాగరాయగానసభ వేదికపై ఉచితంగా మరో వివాహం

చిక్కడపల్లి: త్యాగరాయగానసభ ఆర్థికంగా వెనుకబడిన అన్ని కులాల వారికి ఉచితంగా గానసభ మందిరంలో అన్ని హంగులతో కూడిన కల్యాణవేదికతో పాటు ఇతర సౌకర్యాలు అందిస్తున్న విషయం విదితమే. ఆదివారం గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి వివాహ పెద్దగా లావణ్య రాజుల వివాహం జరిపించారు. వివాహానికి అవసరమైన వెండి కాలి మెట్టెలు, బంగారు మాంగల్యం అందించడంతోపాటు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వధూవరులు జనార్దనమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

సత్యానగర్‌లో తీరని నీటి కష్టాలు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట సత్యానగర్‌లో తాగునీటికి కష్టాలు తీరడం లేదు. గతంలో మూడు పర్యాయాలు నీటి సమస్యపై సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆదివారం స్థానిక మహిళలు రోడెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపుగా 25 ఇళ్లకు సరైన నీటి సరఫరా లేక మండుటెండలో నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజు విడిచి రోజు వచ్చే నీరు సైతం రంగు మారి కలుషితమై వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్, సత్యానగర్ మహిళలు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయసాధనకు కృషి

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఎం. అనిల్‌కుమార్‌యాదవ్, కల్పనాయాదవ్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు పర్వతాలు, రాములుముదిరాజ్, టీపీసీసీ కార్యదర్శి వై.శ్రీనివాస్, రాజు, ఓబీసీ కన్వీనర్ వరదరాజు, లక్ష్మణ్ వర్మ, ఆనంద్ ముదిరాజ్, నాగసాయి, ఎస్సీసెల్ కన్వీనర్ శివ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కన్నాడానియల్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు అంజిరెడ్డి, నియోజకవర్గ ఎస్సీసెల్ చైర్మన్‌రాజు, అబ్దుల్ సమద్, మహ్మద్ ఖదీర్, శ్రీకాంత్, రామకృష్ణ, ఎంరాజు, పుట్టరమేష్, వై.పి.రాజు తదితరులు పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కల్పనాయాదవ్ ఆధ్వర్యంలో..

- రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎం. అనిల్‌కుమార్‌యాదవ్, పాశం అనిల్ కుమార్, రామానుజరెడ్డి, గజ్జల రుషికేష్, మోహన్‌దాస్, అంజియాదవ్, జీఎన్ కేశవ్, సురేష్, మురళీమోజెస్ తదితరులు హాజరై రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.



కన్నాడానియల్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నగేష్ ముదిరాజ్

అందరూ ఉండి.. అనాథలా వృద్ధురాలి మృతి

- మూడు రోజుల అనంతరం విషయం బయటకు..
- జీహెచ్‌ఎంసీ అంత్యక్రియలకు సిద్ధం చేస్తుండగా వచ్చిన బంధువులు



దీనస్థితిలో నర్సమ్మ మృతదేహం

అంబర్‌పేట: అందరూ ఉండి ఓ వృద్ధురాలు అనాథల మృతి చెందింది. మృతి చెందిన రెండు రోజులకు విషయం వెలుగులోకి రావడంతో జీహెచ్‌ఎంసీ దహన సంస్కారాలకు ఏర్పాటు చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న బంధువులు వచ్చి స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వృద్ధురాలి అంతిమ సంస్కారాలు పూర్తి చేసినట్లు సమాచారం. ఈ ఘటన ఆదివారం అంబర్‌పేట డివిజన్‌లో వెలుగులోకి వచ్చింది. స్థానికులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది కథనం ప్రకారం. అంబర్‌పేట డివిజన్ సునార్‌బౌలిలో పార్స నర్సమ్మ (80) తన కుమారుడితో కలిసి ఉంటుండగా.. కుమారుడు తాగుడుకు బానిస అయ్యాడు. కాగా నర్సమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతి చెందినట్లు శనివారం వెలుగులోకి రావడంతో అంత్యక్రియలకు సందిగ్ధం నెలకొంది. దీంతో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ, పోలీస్ విభాగాలకు సమాచారం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ఆదివారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా.. సమాచారం అందుకున్న బంధువులు వచ్చి ఆమె దహనసంస్కారాలు పూర్తి చేశారు. కాగా మృతురాలి కాలికి ఉన్న మూడు వెళ్లు లేకపోవడంతో ఎలుకలు కొద్ది మేరకు కొరికి తిన్నట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది అనుమానిస్తున్నారు. ఎట్టకేలకు బంధువులు, స్థానికులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది అంతా కలిసి ఆదివారం మధ్యాహ్నం ఆమెను అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నల్లకుంట: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి(50) హిందీ మహావిద్యాలయ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా.. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొట్టి వెళ్లింది. ఆ సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ జె. వెంకటేష్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ నరసింహ విషయం తెలుసుకుని ఘటనా స్థలికి వెళ్లి చూసేసరికి అతడు అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు యాష్ కలర్ పుమా ట్రాక్ ప్యాంట్, బ్లాక్ అండ్ వైట్ చెక్స్ చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే నల్లకుంట పోలీసులకు సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లి సత్యకు న్యాయం చేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన నెల్లి సత్యకు న్యాయం చేస్తామని అధికారులు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్ డీ ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన సత్యకు సిద్దిపేట డిగ్రీ కాలేజీలో సీటు కేటాయించడంపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించినట్లు తెలిపా రు. పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకుల సమన్వ య లోపంతో పీహెచ్‌డీ సీటు సిద్దిపేటలో కేటాయించారని అందుకు ఓయూ పరిపాలన విభాగానికి సంబంధం లేదన్నారు. ప్రతి పీహెచ్‌డీ విద్యార్థికి న్యా యం చేస్తామని ఓయూ అధికారులు పేర్కొన్నారు.

పరిశోధన విద్యార్థుల సమష్టి విజయం..

ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థి నెల్లి సత్య పీహెచ్‌డీ ఫీజుల పెంపు, ప్రవేటు రిసెర్చ్ సెంటర్లు ఏర్పాటు పై గత రెండు నెలలుగా పోరాడుతుండటంతో ఆయన పై అధికారులు కక్షగట్టారని పరిశోధన విద్యార్థులు పేర్కొన్నారు. ఆందోళనలు చేసే విద్యార్థులు ఓయూ క్యాంపస్‌లో ఉండకూడదనే సంకుచిత ఆలోచనతో సత్యకు ఆర్ట్స్ కాలేజీలో కేటాయించిన సీటును సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి బదిలీ చేశారని పరిశోధన విద్యార్థి ఆజాద్ పేర్కొన్నారు. అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయంపై విద్యార్థులు పోరాట ఫలితంగా తిరిగి పీహెచ్‌డీ సీటును ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఇచ్చేల స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయించడం సమష్టి విజయం అన్నారు. పీహెచ్‌డీ ఫీజు పెంపు, ప్రైవేటు రీసెర్చ్ సెంటర్ల రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు.

కలుషితనీటి సరఫరాను అరికట్టాలి



సరఫరా అవుతున్న కలుషిత నీరు

అబిడ్స్: కొన్ని రోజులుగా అల్లాబండ సెక్షన్ ప్రాంతంలోని ఇందిరానగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతున్నా వాటర్‌బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 రోజులుగా ఇందిరానగర్ బస్తీలో కలుషిత నీటి సరఫరా అవుతుండడంతో స్థానికులు అనారోగ్యాలు గురవుతున్నారు. వాటర్ బోర్డు జీఎం, డీజీఎం, జీఎంల దృష్టికి కలుషిత నీటి సరఫరా నివారించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. అల్లాబండ సెక్షన్ మేనేజర్‌కు స్థానిక ప్రజలు ఫిర్యాదు చేయకగా ఆయన స్పందించకపోవడంతో డీజీఎం, జీఎంలకు కూడా ఫిర్యాదు చేసినా కలుషిత నీటి సరఫరా అలాగే కొనసాగుతుందన్నారు. వెంటనే మరమ్మతులు చేసి కలుషిత నీటి సరఫరాను అరికట్టకుంటే వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇందిరానగర్ ప్రాంతంలో ఇంటి నెంబర్:13-1-1236 పరిసర ప్రాంత ఇళ్లల్లో ప్రతిరోజూ కలుషిత నీటి సరఫరా అవుతుందని వారు వాపోయారు.

బ్రాహ్మణ భవన్ ప్రారంభానికి తరలిరావాలి



మాట్లాడుతున్న కాండూరి కృష్ణమాచారి

సుల్తాన్‌బజార్: ఈనెల 31న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించబోయే బ్రాహ్మణ భవన్‌కు అర్చక, ఉద్యోగులు వేలాదిగా తరలిరావాలని తెలంగాణ దేవాదాయ శాఖ జేఏసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతూ 2017లో 577 జీఓ ప్రకారం.. 5625 మంది ఉద్యోగులను గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ వాఖ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, జేఏసీ కన్వీనర్ పి.రవీంద్రాచార్యులు, అర్చక అధ్యక్షుడు చింతపట్ల బద్రీనాథ్, అర్చక వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖర శర్మ, గ్రేటర్ అధ్యక్షుడు నాగరాజు శర్మ, కృష్ణమాచార్యులు, గంగు సత్యమూర్తి, సంతోష్, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ వాకింగ్ చేయండి



మాట్లాడుతున్న వరకుమార్ గుప్తా, డాక్టర్ రాజేందర్ కుమార్ తదితరులు

అబిడ్స్: ప్రతిఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండేందుకు కొంతసేపు అయినా ప్రతిరోజూ వాకింగ్ చేయాలని వాసవిక్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా పేర్కొన్నారు. మనిషి తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలన్నారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే వందేళ్ల జీవితం సుఖశాంతులతో ఉంటుందన్నారు. ఆదివారం వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ల ఆధ్వర్యంలో ఉచితంగా న్యూరో, ఆర్థోపెడిక్ సమస్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వరకుమార్‌గుప్తా మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. డాక్టర్ రాజేందర్ ప్రసాద్ మాట్లాడుతూ.. జీవితంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యకర జీవితం పొందేందుకు శారీరక శ్రమ ఎంతో అవసరమన్నారు. వాకింగ్, యోగాసనాలు కొంతసేపు అయినా చేస్తే ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి అంబరిషా, కోశాధికారి వెంకటేష్, పూర్వ అధ్యక్షులు చక్రపాణి, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు రమేష్‌రెడ్డి, నీరంజన్ రెడ్డి, డాక్టర్ సునీల్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం



ధ్వంసమైన షాప్ లోపలిభాగం

చిక్కడపల్లి: చిక్కడపల్లిలోని ఓ వస్త్ర దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. చిక్కడపల్లి ప్రధాన రహదారిలోని గోకలర్స్ షాప్‌లో ఏసీలలో షార్ట్‌సర్క్యూట్‌తో విలువైన బట్టలు కాలిపోయాయి. సమాచా ర ం అందుకున్న ముషీరాబాద్ అగ్నిమాపక కేంద్రం ఫై ర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటనా స్థలాని కి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

దుకాణాదారులకు అవగాహన సదస్సు



దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్

ముషీరాబాద్: ఇటీవల టింబర్‌డిపోలు, ఫ్లైవుడ్ షాప్స్, ప్లాస్టిక్, స్క్రాబ్ దుకాణాలల్లో వేసవికాలంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలు, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్లపై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం ఆయా దుకాణా దారులతో పోలీసు ఉన్నతాధికారులు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి దుకాణంలో 5 నుంచి 10 డ్రమ్ముల నీళ్లు, ఇసుక బస్తాలు, ఫైర్ ఎక్యూమెంట్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలని కోరారు.

- దుకాణాలు నలుదిక్కుల మూసివేయకుండా చూసుకోవాలన్నారు. వర్కర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి సమయాలల్లో దుకాణంలో పడుకోకూడదని తెలిపారు.
- 24 గంటల పర్యవేక్షణ కోసం ఓ వాచ్‌మెన్‌ను పెట్టుకోవాలని సూచించారు. కరెంటు లూజ్‌కేబుల్స్ లేకుండా చూసుకోవాలన్నారు.
- ఎక్కువ స్క్రాబ్ స్టోరేజ్, ఓవర్‌లోడ్ లేకుండా ఉండాలని స్క్రాబ్‌ను రోడ్డుమీద వేయకుండా చూసుకోవాలన్నారు.
- చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవద్దని, గ్యాస్‌సిలిండర్లు, పెట్రోలు వంటి పేలుడు పదార్థాలు షాప్స్‌లో పెట్టుకోవద్దని సూచించారు. సీసీ టీవీ కెమెరాలను దుకాణంలో అమర్చుకోవాలని సూచించారు. ప్రసాద్‌రెడ్డి, సోమశేఖర్, స్వప్న, స్క్రాబ్ బిజినెస్ దారులు, టింబర్ డిపో మర్చంట్స్ యజమానులు, సామిల్స్ ఓనర్లు సుమారు 100 మంది హాజరయ్యారు.

ఆరోగ్యంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న డాక్టర్ రాజేంద్ర కుమారన్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజలు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రాజేంద్రకుమారన్ అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, వాసవి క్లబ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో " ఆర్థోపెడిక్ మరియు మానసిక సంబంధ" సమస్యలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్ర కుమారన్ మాట్లాడుతూ.. వయస్సు పెరిగే కొద్ది అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. మోకాళ్లు, నడుం తదితర నొప్పులతో మానసిక సమస్యలు కూడ వస్తాయని తెలిపారు. శారీరక వ్యాయామం అనేది ప్రతి ఒక్కరికి అవసరమని వాకింగ్ చేయటం కొంత మేర ఉపశమనం లభిస్తుందన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్నవారు ఎక్కువగా మెట్టు ఎక్కడం వల్ల మరింత సమస్య పెరగటంతో పాటు గుండెపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని సూచించారు. ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని వివరించారు. వాసవి క్లబ్ అధ్యక్షులు వరకుమార్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ సునిల్‌కుమార్, మాజీ అధ్యక్షులు నాగభూషణం, శైలజామోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితవైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రక్తపరీక్ష చేయించుకుంటున్న సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు

ముషీరాబాద్ : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని బహదూర్‌యార్‌జంగ్ ఫంక్షన్‌హాల్‌లో పీఎస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సెంట్రల్ జోన్ ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్పొరేట్ వైద్య సంస్థలు మానవతా దృక్పదంతో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ముందుకు రావాలన్నారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుజితకుమార్, డాక్టర్ మొయినుద్దీన్, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ స్వాతి, తదితరులు వైద్య సేవలను అందించారు. 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను కలిగి ఉండాలి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్తికేయాదవ్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని బ్రహ్మగారి దేవాలయం వీధిలోని కళాగోలమ్మ అమ్మవారి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పెద్ద ఎత్తున బోనంతో భక్తులు నైవేద్యం సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఏటా కళాగోలమ్మ బోనాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేలా కృషి చేస్తున్న నిర్వాహకులను ప్రశంసించారు. విద్యార్థి విభాగం ఇన్‌చార్జ్ కార్తికేయాదవ్, ముషీరాబాద్ డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు సదా, నాయకులు సిరిగిరి శ్యామ్, బ్రహ్మం, అశోక్ చారి, కిరణ్ అనంతచారి, సత్యనారాయణ తదితరులున్నారు.

ఆర్య సమాజ్.. సేవా కార్యక్రమాల్లో భేష్

- నిజాం వ్యతిరేక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర
- పేద విద్యార్థులకు ఉచిత బోధన

బన్సీలాల్‌పేట్: భారతీయుల్లో తమ దేశం, ఆర్య ధర్మం, ఆర్య గ్రంథాల పట్ల భక్తి విశ్వాసాలు కల్పిస్తూ జాతిలో ఆత్మ విశ్వాసం పునరుజ్జీవింపజేసిన మహా పురుషుడు దయానంద సరస్వతి. నాటి గొప్ప చారిత్రక అవసరాన్ని గుర్తించిన స్వామి దయానంద సరస్వతీ ఆర్య సమాజాన్ని 1875లో స్థాపించారు. సకల సత్యాలకు, అత్యున్నత ఆధ్యాత్మిక విజ్ఞానానికి వేదాలే మూల స్తంభాలని, వేదాల పునాదులపై హైందవ పునః స్థాపన జరగాలని అభిలాషించిన వైదిక ధర్మ ప్రచారకుడు దయానందుడు. ఆర్య సమాజ్‌లు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సమాజపురోభివృద్ధికి తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. ఆర్య సమాజాలు ఇటీవలే ఆర్య సమాజ్ స్థాపన దినాన్ని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ విమోచన కోసం, నాటి నిజాం హయాంలో ఆర్య సమాజ్ ప్రతినిధులు వీరోచితంగా పోరాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలు, ఆందోళనలో ఆర్య సమాజ్ ప్రతినిధులు క్రియాశీలకమైన పాత్ర నిర్వహించారు. నాడు నిజాంపై బాంబు వేసిన నారాయణరావు పవార్ కూడా ఆర్య సమాజ్ ప్రతినిధే.

సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులో..

సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ఆర్య సమాజానికి ఎంతో చరిత్ర ఉంది. 1940లో దీన్ని స్థాపించి అప్పటి నుంచి నేటి వరకు అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆర్య సమాజ్ ఏర్పాటుతో పాటు విస్తరణ కార్యకలాపాల కోసం లాలా ముస్సీరామ్ దుసాజ్‌తో పాటు రామ్ రఖా, పండిట్ సోమనాథ్ శాస్త్రీ, బాల్‌రాజ్, పండిట్ నారాయణ స్వామి, బండారి సత్యనారాయణ, పండిట్ క్రిష్ణ స్వామి నాయుడులు ముఖ్య పాత్ర పోషించారు. పేదలకు విద్యా బోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలతో సమాజపురోభివృద్ధి కోసం తనవంతు పాత్ర నిర్వహిస్తూ ఆ దిశగా ముందుకు సాగుతుంది. ఈ ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌హిందీ మహావిద్యాలయ నర్సరీ నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో నడిపిస్తున్నారు.



ఆర్పీ రోడ్డులోని ఆర్యసమాజ్ భవనం

సమాజహితం కోసం..

ఆర్య సమాజ్ సమాజహితం కోసం పనిచేస్తోంది. నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో సమాజ పురోభివృద్ధి దిశగా ఆర్య సమాజ్ అడుగులు వేస్తోంది. కుల, మత, జాతి విభేదాలకు అతీతంగా లోకకల్యాణం కోసం పాటు పడుతున్నాం.

–కంది విశ్వనాథం ఆర్యసమాజ్ మంత్రి



సేవల విస్తరణకు కృషి..

స్వామి దయానందుడు స్థాపించిన ఆర్య సమాజ్‌ను మరింత విస్తరించడానికి కృషి చేస్తున్నాం. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వేదధర్మ ప్రచారాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. స్వామి దయానంద సరస్వతీ ఆశయాలు, ఆదర్శలను సమాజంలోకి తీసుకెళ్లడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–మాశెట్టి శ్రీనివాస్ ఆర్య, సికింద్రాబాద్ ఆర్య సమాజ్ అధ్యక్షులు

